క్లుప్తంగా

పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు

నిడదవోలు: ఖరీఫ్ సాగు అవసరాల కోసం డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు దశలవారీగా నీటిని విడుదల చేస్తున్నారు. రైతుల సాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు శుక్రవారం 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2130 , మధ్య డెల్టాకు 1530 క్యూసెక్కులు వదిలి పెట్టారు. పశ్చిమ డెల్టాలో ఇప్పటికే ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాల్లో దమ్ములు, నారుమడుల పనుల్లో రైతులు నిమగ్న మయ్యారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 753, తణుకు కాలువకు 536, ఉండి కాలువకు 578, నరసాపురం కాలువకు 1281, అత్తిలి కాలువకు 390 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ఇద్దరు మహిళలకు ఏపీఎన్ఆర్టీఎస్ చేయూత

కడప కార్పొరేషన్ : పాస్‌పోర్టులు లేక కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న ఇద్దరు మహిళలకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) చేయూత అందించింది. ఆ సంస్థ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్ సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన తలారి లక్ష్మి, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన షేక్ షబీనాలు మూడేళ్ల క్రితం హౌస్ మెయిడ్ (ఇంటి పని) కోసం కువైట్‌కు వచ్చారు. స్పాన్సర్ ఇంట్లో పని ఎక్కువగా ఉండడం, పైగా తిట్టి, కొట్టడాన్ని భరించలేక ఇళ్ల నుంచి పారిపోయారు. కువైటీల ఇళ్ల నుంచి పారిపోయి వచ్చాక ఎక్కడ ఉండాలో అర్థం కాక అవస్థలు పడుతున్న వారికి ఏపీఎన్ఆర్టీఎస్ ప్రొవిజనల్ కో ఆర్డినేటర్ ఎన్వీ సుబ్బారెడ్డి ఆశ్రయం కల్పించారు. రెండు నెలల పాటు వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. వారిద్దరికీ పాస్‌పోర్టులు లేనందున భారత రాయబార అధికారుల సహాయంతో తాత్కాలిక పాస్‌పోర్టులు తయారు చేయించి ఇండియాకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 29న వారు ఎయిర్ ఇండియా విమానంలో బయలుదేరి 30 తేది హైదరాబాద్‌కు చేరుకుని వారి స్వస్థలాలకు వెళ్లారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీల శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు

నిడదవోలు రూరల్: ఎస్సీల శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో మునిపల్లి గ్రామంలో మెరక చేసిన శ్మశానవాటికను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ తీర్మానంతో మట్టిని తరలించి శ్మశానాన్ని మెరక చేసినట్లు సర్పంచ్ వెలగన నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొర్లపాటి మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

కొవ్వూరు: స్థానిక మెరక వీధిలోని వినాయకుని గుడి వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వెంకటరమణ పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాతకు కొండంత అండగా..

- రైతు భరోసా కేంద్రాలతో మేలు
- సాగుకు ముందస్తు పెట్టుబడి సాయం
- సమయానికి ఎరువులు, విత్తనాల సరఫరా
- రైతుకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం



కౌలు రైతులకు గుర్తింపు పత్రాలు అందిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు (ఫైల్)

పెరవలి: రైతు సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోంది. గత ప్రభుత్వాలు రైతును 'దేశానికి వెన్నెముక ' అనే అందమైన నినాదానికే పరిమితం చేశాయి తప్ప అన్నదాత వెన్ను తట్టి ప్రోత్సహించింది లేదు. అందుకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు విత్తుల సరఫరా నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు వరకూ అన్నింటా అండగా నిలుస్తోంది. అందు కోసం గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు ముంగిటకే వారికి అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తోంది. ప్రతి రైతుకూ పంట సాగుకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని అందించడమే గాకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, అందించి ఆదుకుంటోంది. ఒక వేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఆలస్యం చేయకుండా రైతులకు పరిహారాన్ని అందిస్తోంది.

నట్టేట ముంచిన టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం పట్ల వివక్ష కొనసాగింది. రుణమాఫీ మొదలు.. ధాన్యానికి మద్దతు ధర.. పంట ఉత్పత్తుల కొనుగోలు వరకూ రైతులను నిలువునా మోసగించింది. మిల్లర్లతో లాలూచీ పడి మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నడ్డి విరిచింది. ఎలాంటి సాయం అందక పోవడంతో పంటలు నష్టపోయిన అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

ఆర్బీకేల ద్వారా రైతుల చెంతకే సేవలు

పెరవలి మండలంలో 20 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి పరిధిలో ఆరు వేల రైతు కుటుంబాలు ఉన్నాయి. 11,972 మంది రైతులు 18,470 ఎకరాల్లో ప్రధానంగా వరితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని డిజిటల్ కియోస్కుల ద్వారా సర్టిపై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులు బుక్ చేసుకున్న స్వల్ప వ్యవధిలోనే వారికి రాయితీపై అందిస్తున్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, నియోజక వర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి ఎకరాలో సాగయ్యే పంటల వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలను రైతులకు అందిస్తున్నారు. ఏటా జూన్ మొదటి వారంలోనే పశ్చిమ డెల్టా కాలువలతో పాటు పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు.



అన్నవరప్పాడు ఆర్బీకే నుంచి ఎరువులు తీసుకు వెళుతున్న రైతులు

తొలిసారి అరటి రైతులకు సాయం

2022లో సంభవించిన గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పెరవలి మండలంలోని లంక భూముల్లోని అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టంపైఅధికారుల సమగ్రంగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. కొద్ది రోజులకే చరిత్రలో మొదటిసారిగా మండలంలోని 1456 మంది అరటి రైతులకు రూ.8.16 కోట్ల పంటల బీమా పరిహారాన్ని అందించారు.

నాలుగేళ్లలో మండల రైతులకు చేకూరిన లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా	రూ.27.09 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ	రూ.1.16 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.96.08 లక్షలు
పంట నష్టపరిహారం	రూ.7.32 కోట్లు
యంత్రసేవా పథకం ద్వారా	రూ. 55 లక్షలు
20 ఆర్బీకేల నిర్మాణానికి చేసిన ఖర్చు	రూ.5 కోట్లు

ఆర్బీకేల ద్వారా రైతులకు మేలు..



ఆర్బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వ సేవలపై రైతులకు నమ్మకం పెరిగింది. ఈ క్రాప్ ద్వారా పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందుతోంది. నాణ్యమైన పురుగు మందులతో పాటు ఎరువులను విక్రయిస్తున్నారు.

–అడపా సీతారామయ్య, రైతు, కాపవరం

కౌలు రైతులకు సాయం



వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా కౌలు రైతులకు కూడా రూ.13,500 సాయం అందిస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ సాయం ఎంతో అండగా నిలుస్తోంది.

– వెలిగంటి సత్యనారాయణ, రైతు, కానూరు

యంత్రాలతో ఎంతో మేలు



ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతోంది. ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేసుకునే ఆర్థిక స్థోమత సన్న, చిన్నకారు రైతులకు ఉండదు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రాయితీపై అర్హులైన రైతులు యంత్రాలు పొందవచ్చు.

–జి సూర్యనారాయణ రాజు, రైతు, పిట్టల వేమవరం

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

- అభివృద్ధి చేశాం.. మరోసారి ఆశీర్వదించండి
- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిపర్రులో గడప గడపకూ..



తాడిపర్రులో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిపర్రు గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వం పని తీరు, స్థానిక సమస్యలపై ఆయన ప్రజలను ఆరా తీశారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గత నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరినన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తాడిపర్రు గ్రామానికి చేసిన అభివృద్ధితో పాటు, గ్రామస్తులను ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అక్కిన రామకృష్ణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, ఆరిగెల వెంకటసుబ్బయ్య, పోడూరి హనుమంతు, గరిమెళ్ళ తాతారావు, గారపాటి లచ్చయ్య, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ' నిధులతో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రామన్నపాలెంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్‌కు శంకుస్థాపన



రామన్నపాలెంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: 'గడప గడపకూ' లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ఒక్కొక్క గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల మంజూరు చేసినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గడప గడపకూ నిధులు రూ.20 లక్షల వ్యయంతో మండలంలోని రామన్నపాలెంలో నిర్మించే సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లకు శుక్రవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, జెడ్పీటీసీ సభ్యురాలు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

ద్వారకాతిరుమల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో జగనన్న సురక్షపై శుక్రవారం నియోజకవర్గ స్థాయి మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష ఇంటింటి సర్వే ఈ నెల 24 నుంచి మొదలైందన్నారు. అర్హత ఉండి పథకాలు అందని, లబ్ధి పొందని వారిని గుర్తించారన్నారు. వారి నుంచి పథకం పొందేందుకు కావాల్సిన పత్రాలను సేకరించినట్టు తెలిపారు. వాటిని సచివాలయంలో అందించి, ఇప్పటికే టోకెన్ నంబర్లు జారీ చేసినట్టు చెప్పారు. జులై 1న మొట్టమొదటిగా ద్వారకాతిరుమల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, దేవరపల్లి, నల్లజర్ల ఎంపీపీలు కేవీకే దుర్గారావు, బంకా జయలక్ష్మి, గోపాలపురం, దేవరపల్లి, ద్వారకాతిరుమల జెడ్పీటీసీలు కాకులపాటి లలిత, పొట్టి స్వర్ణకుమారి, చిగురుపల్లి శామ్యూల్, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హులకు నూరు శాతం పథకాలు

- అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం
- జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

నిడదవోలు: అర్హులకు నూరు శాతం పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జూలై 1 నుంచి పట్టణ, మండలస్థాయి అధికారులతో సచివాలయాల్లో సురక్ష క్యాంపులు నిర్వహించాలన్నారు. క్యాంపుల్లో కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ, బియ్యం కార్డు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యుటేషన్స్, ఫోన్ నంబర్‌తో ఆధార్ లింకేజీ తదితర 11 రకాల సర్టిఫికెట్స్ జారీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మండల ప్రత్యేకాధికారి కె.స్వాతి, ఎంపీడీవోలు ఎంజీ రాజు, పి. శ్రీనివాసరావు, తహసీల్దారు ఎం.గంగరాజు. టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ పాల్గొన్నారు.

కొవ్వూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. స్థానిక గౌతమీనగర్–2, ఔరంగాబాద్ ఎనిమిదో సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సర్వేలో గుర్తించిన వారంతా సద్వినియోగ పరుచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌వో సాయి సందీప్, జేసీఎస్ ఇన్‌చార్జ్ నగ్గలపాటి శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, అంకోలు లిల్లీ వెంకట పద్మలీల, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, చీరా అరుణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని 14 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలివి: స్థానిక వైఎస్సార్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న హెల్త్ క్లినిక్ భవనాన్ని పూర్తి చేయడానికి రూ.11.16 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. బసివిరెడ్డిపేటలోని బట్టీలపేటకు తాగునీటి పైపులైన్ పనులకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.50 వేలు కేటాయించారు. ఎస్టీ కాలనీలోని మురుగునీటి డ్రైన్ పునర్నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ.4 లక్షలు కేటాయించారు. అలాగే ఒకటో వార్డులో మంచినీటి పైపులైన్ పనులకు సాధారణ నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. పట్టణంలోని జగనన్న కాలనీకి అమృత్ పథకంలో రాష్ట్ర నీటి ప్రణాళిక రెండో విడతగా రూ.5.30 కోట్లు మంజూరయ్యాయి. వాటికి డీపీఆర్‌లు తయారు చేయడానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ. 5 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా అండతో గర్భిణి వైద్యానికి సాయం




కొయ్యలగూడెం ఆసుపత్రిలో సుప్రజ

నల్లజర్ల: పేదింటి గర్భిణి అత్యవసర వైద్యానికి సోషల్ మీడియా సాయంతో ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాహకుడు గంట వ్యవధిలోనే రూ. 25 వేలు సేకరించి అండగా నిలిచాడు. ఆ వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అనంతపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సుప్రజ నిండు గర్భిణి. కొన్ని అనారోగ్య పరిస్థితుల్లో ఆమెను కొయ్యలగూడెంలోని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో ఉన్న ఆమెకు డెలివరీ చేయాలంటే రూ.18 వేలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ఈ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఉన్నా కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆమె సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుప్రజకు తల్లిదండ్రులు లేరు. ఆమె భర్త ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమే. దిక్కుతోచని స్థితిలో ఉన్న సుప్రజ ఆర్థిక సాయం చేసే వారి కోసం ఎదురు చూస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అనంతపల్లికే చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ అధినేత ఎంఎస్ చెల్లారావు స్పందించారు. వెంటనే ఆయన సుప్రజ పరిస్థితిని వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టి, ఆమెకు ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరారు. ఆ పోస్టు చూసి స్పందించిన అనంతపల్లి గ్రామ యువత ఆదుకోవడానికి తామున్నామంటూ ముందుకొచ్చారు. తలో రూ.వెయ్యి చొప్పున జమ చేశారు. దాంతో గంట వ్యవధిలోనే దాదాపు రూ.25 వేల వరకు సమకూరాయి. ఈ సొమ్మును చెల్లారావు మాస్టారు ఆసుపత్రికి తీసుకెళ్లి బాధితురాలు సుప్రజకు అందించి తల్లీబిడ్డలను కాపాడారు. చెల్లారావు మాస్టారిను పలువురు అభినందించారు.

ఆర్యవైశ్యులు ఐకమత్యంగా ఉండాలి

చాగల్లు: ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంగా ఉండాలని ఏపీ ఆర్యవైశ్య సంఘ మహాసభ అధ్యక్షుడు కోనా శ్రీనివాస్ అన్నారు. ఇటీవల ఏపీ ఆర్యవైశ్య సంఘ మహాసభ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్‌ను శుక్రవారం చాగల్లులో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా 'కోడి'



కోడి శ్రీనివాసరావు

చాగల్లు: చాగల్లుకు చెందిన కోడి శ్రీనివాసరావు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.గతంలో ఆయన చాగల్లు–నెలటూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ చైర్మన్‌గా మెరుగైన సేవలు అందించి క్లబ్‌కు మంచి పేరు తీసుకువస్తానన్నారు. లయన్స్ సభ్యులతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

కొవ్వూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం



లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

కొవ్వూరు: భవిష్యత్తులో లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా నూతన కార్యవర్గం పనిచేయాలని ఆ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ అన్నారు. ఆ క్లబ్ కొవ్వూరు శాఖ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం దొమ్మేరులోని ఇంద్రప్రస్థానం జీఎల్ కమ్యూనిటీ హాల్లో జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కలగర వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా పెనుమాక జయరాజు, కోశాధికారిగా ఉప్పులూరి రామకృష్ణతో పాటు ఇతర సభ్యులతో రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.కొవ్వూరులో శాశ్వత ప్రాజెక్టుకు రూ.50 వేలు, కొవ్వూరు క్లబ్‌కు రూ.10 వేలు విరాళంగా అందిస్తున్నట్లు అనంతరం రవికుమార్ ప్రకటించారు. లయన్ జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి క్లబ్‌కి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ పాలెంపాటి చినబాబు చౌదరి రూ.10 వేలు కొవ్వూరుకు, రూ.5 వేలు నెలటూరు క్లబ్‌ల సేవా కార్యక్రమాలకు విరాళంగా అందజేశారు. వి. సత్య స్వరూప్ రూ.5 వేలు విరాళం ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించారు. కంఠమణి రామకిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జోన్ చైర్మన్‌లు గారపాటి శ్రీనివాసరావు, కోడి శ్రీనివాసరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పాట్రు శ్రీనివాస్, హరిబాబు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా వెంకటరమణ

చాగల్లు: జగనన్న గృహ సారథుల (జేసీఎస్) చాగల్లు మండల ఇన్‌చార్జ్‌గా మూల వెంకటరమణ నియమితులయ్యారు. తన ఎంపికకు సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, హోంమంత్రి తానేటి వనిత, వైఎస్సార్‌సీపీ నాయకులకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.